# మధుర భావన-9

అపుడాయన చిరునవ్వుతో పిల్లల వైపు చూస్తూ ఒక మాట చెప్పారు.

''ఈ ఆస్తిపాస్తుల పంపకం కంటే... మేమిద్దరం... అంటే మీ అమ్మా నాన్నలం, మీకు మేము ఇచ్చే విలువైన ఆస్తి ఒకటే... అదే ఒక మాట... 'మంచి ఆలోచనలతో మనసును నింపుకుంటే... జీవితం మధురంగా గడుస్తుంది'!''

''అవును... నాన్నా... ఈ విషయాన్ని ఎపుడూ గుర్తుపెట్టుకుంటా!'' అన్నాడు వంశీ. అనూషా తల వూపింది.

ఆ తర్వాత కొంతకాలానికే ఆయన మరణించటం జరిగింది! 'మధుర భావన' అనేది తండ్రి తమకు ఉపదేశించిన మంత్రంగా వంశీ భావించాడు.

''ఇదంతా... మర్చిపోలేదమ్మా... ఎందుకు నువ్వు 'గుర్తుందిగా' అనడిగావ్... తప్పకుండా నేను... నాన్నగారి కోరిక నెరవేర్చే ప్రయత్నం చేస్తాను! నీ పేరనున్న స్థలంలో ఒక ఇల్లుకట్టి... ఆ ఇంటికి నాన్న చెప్పిన 'మధురభావన' అనే పేరు పెట్టాలనే ఆలోచన నాకుంది! ఈ మాట ఇంతకు మునుపు నీకు చెప్పానుకదమ్మా...?'' అన్నాడు వంశీ తల్లితో.

ఆవిడ నిట్టూర్చింది ''ఇపుడు... నీ చెల్లెలు... నీ పెళ్ళికి తనకి ఆడబడుచు లాంఛనంగా ఆ స్థలం కావాలని అడుగుతోంది! మీ నాన్న కొంచెం చవకలో వచ్చిందనీ...ఊరుకు చివరగా అయినా బావుందని కొన్నారు. నీ మాటపై దానిని నా పేర పెట్టారు.... నా తదనంతరం నీకే చెందాలని!''

ఆమె గొంతు కొంచెంగా బొంగురు పోయింది కూడా.

వంశీ ఒకే ఒక్క క్షణం మౌనంగా ఉండి... తర్వాత చిరునవ్వుతో చెప్పాడు.

''సరే... దానిదేముందమ్మా... అలాగే ఇద్దాం...!'' అన్నాడు.

ఆవిడ వంశీవైపు చురుగ్గా సూటిగా చూసి ''నీ పేర... ఏ కొంచెం ఆస్తి లేకుండా... చెల్లెలుకే ఇచ్చేస్తానంటున్నావా... అంటే... సుమజ పేర ఆస్తి బాగానే వస్తుందనే భరోసాతోనా...?'' అని ప్రశ్నించింది.

ఆ ప్రశ్నకి మనసు విలవిలలాడినట్లుగా బాధగా తల్లివైపు చూసిన వంశీ డగ్గుత్తికతో అన్నాడు ''ఏమిటమ్మా అలా అంటున్నావ్... నువ్వు... ఇపుడు చెబితేనే కదా సుమజ పేర ఆస్తిపాస్తులు చాలానే ఉన్నాయనే విషయం తెలిసిందీ... అయినా ఓ మాట చెబుతాను... వినమ్మా... సుమజ ఆస్తిపాస్తుల విషయం నాకు పూర్తిగా అనవసరం... నాకేమీ అవసరం లేదు. నేను పూర్తిగా నా స్వశక్తితో సంపాదించే దానితోనే మా జీవితం గడుస్తుంది. ఇది ఖచ్చితం...! నమ్ముతావుగా...?''

శ్యామసుందరి అనూష వైపు నిరసనగా చూసి ''వంశీ మాటలు విన్నావుగా, నీ సందేహం తీరిందా...?'' అనడిగింది.

అనూష విసురుగా లేచింది. ''అన్నయ్యకేమీ అభ్యంతరం లేదు. నీకే ఇష్టం లేదని నాకెపుడో తెలుసు...!'' అంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

''ఈ విషయాన్ని ఎందుకమ్మా పెద్దదిగా చేసుకోవటం...! అనూష ఇష్టప్రకారం చేస్తే సరిపోతుందిగా...!'' అన్నాడు వంశీ తల్లితో అనునయంగా.

అతనూ అక్కడనుండి వెళ్ళిపోయి కాసేపటి తర్వాత తిరిగి వచ్చి తల్లి ఇంకా అక్కడే దిగులు మొహంతో కూర్చుని ఉండటం చూసి తల్లడిల్లుతున్నట్లుగా ''ఏమిటమ్మా... ఇంకా అలా దిగులుగా కూర్చున్నావ్... ఇందులో అంత బాధపడాల్సిన సమస్యేముందీ...! అనూషతో నేనూ ఇపుడే మాట్లాడాను. తనేమంటుందంటే... బావా వాళ్ళు ఇద్దరు అన్నదమ్ములు కదా... వాళ్ళ స్వంత ఇంటిని రెండు భాగాలుగా ఇద్దరూ పంచుకుని చెల్లెలు పెళ్ళి బాధ్యతనూ సమంగా తీసుకోవాలని నిర్ణయించుకున్నారట. బావ తమ్ముడు ఇల్లంతా తీసుకుని చెల్లెలి పెళ్ళి ఖర్చునూ భరించే ఏర్పాటుతో అనూషవాళ్ళు వేరే చోట ఇల్లు కట్టుకోవటం బావుంటుందని అనుకున్నారట! అందుకని... మనకున్న స్థలాన్ని ఇస్తే.. అనూష వాళ్ళు అక్కడ ఇల్లు కట్టుకోవటం జరుగుతుందట! అలాగని అనూష అత్తగారూ, ఆయనా అడగమన్నారని అనూష అంటోంది...''

''ఆ స్థలం అపుడు ఊరవతల ఉంది కాబట్టి... చవకలో కొనగలిగాం! ఇపుడు ఊరు మధ్యన అయి... ఎంత రేటు పెరిగిందో తెలుసుకదా..?'' శ్యామసుందరి అంది.

దానికి వంశీ ''అయితే ఏమిటమ్మా... ఎవరో బయట వాళ్ళకు మనం ఇవ్వటం లేదుగా... మన ఇంట్లో వాళ్ళకేగా... నాకయితే ఏమిటి... అనూష కయితే ఏం...!'' అన్నాడు!

దానికి శ్యామసుందరి ఏదో జవాబు చెప్పబోయింది గానీ గది తలుపు తీసుకుని అక్కడ నిలబడిన అనూషని చూసి మాటలు ఆపేసింది.

''ఏంటీ... అమ్మ కొడుకులిద్దరూ గుసగుసలు పోతున్నారూ...?'' అనడిగింది అనూష మాటలు సాగదీస్తూ...

ఆవిడ కూతురివైపు నిర్లిప్తంగా చూసి వూరుకుంది. వంశీ చిరునవ్వుతో అన్నాడు.

''అదే... అనూషా మీ అత్తగారూ, మీ ఆయన అడిగింది సమంజసంగానే ఉంది, వెనుకాడాల్సిన పనిలేదని అమ్మకి చెబుతున్నాను!''

శ్యామ సుందరి కూతురివైపు చూస్తూ కొంచెం తీవ్ర స్వరంతోనే అడిగింది ''ఏమిటీ... మీ అత్తగారూ వాళ్ళు నిన్ను అన్నయ్య పెళ్ళిలో ఆడబడచు లాంఛనంగా ఆ స్థలం కావాలని అడగమన్నారా...?''

అనూష తొట్రుపడకుండా జవాబు చెప్పింది ''అవును... అదేగా, నీకు చెప్పిందీ, అదే అన్నయ్యకూ చెప్పాను!''

''మరి... వాళ్ళిద్దరితో ఈ మాట అంటే... ఏమీ తెలియనట్లుగా తెల్లమొహం వేసి 'అలా ఎలా అడగగలమూ, ఏవైనా లాంఛనంగా కొద్దో గొప్పో ఇవ్వటం బావుంటుంది గానీ అంత ఖరీదైన స్థలం ఇమ్మని అడగటానికి మాకు మాత్రం ఇంగితం లేదా' అన్నారు! ఇప్పుడు చెప్పు... వాళ్ళ పేరుతో నువ్వే అడుగుతున్నావు కదూ...?''

తల్లి మాటలకు అనూష మొహం నల్లబడింది. ఒక క్షణం తల్లివైపు విస్మయంగా చూస్తూ నిలబడిపోయింది. తర్వాత తెలివి తెచ్చుకున్నట్లుగా మాటలు విసిరింది.

''అవునమ్మా... వాళ్ళు నా దగ్గిర అలా నసపెట్టి... నీ దగ్గిర మాత్రం నంగనాచి కబుర్లు చెప్పారన్నమాట! అయినా నువ్వు నన్ను, నా మాటల్నీ నమ్మకుండా వాళ్ళనే నమ్మి వాళ్ళనే సమర్థిస్తావు... అంతేగా...'' అని లోపలకు వెళ్ళిపోయింది అనూష.

శ్యామసుందరి గట్టిగా నిట్టూర్చింది.

వంశీ ఆవిడ చేతుల్ని పట్టుకుని ''ఇదేదో పెద్ద సమస్యగా భావించి నువ్వు మనసు పాడుచేసుకోకమ్మా...! ఎవరు.. ఏ ఉద్దేశ్యంతో అడిగినా గానీ మనం ఆలోచించాల్సిన పనిలేదు! నాన్న చెప్పినట్లుగా అందరిలోనూ మంచిని మాత్రమే చూసి మన మనసులనూ మంచి భావనలతో నింపుకుందాం...!' 'మధుర భావన' అనేది నేను కట్టే ఇల్లయితేనేం, అనూషా వాళ్ళు కట్టుకుంటేనేం...! ప్రస్తుతానికి మనకీ ఇల్లు బాగానే ఉందిగా...! అనునయంగా అన్నాడు వంశీ.

శ్యామ సుందరి అలాగే ఆలోచిస్తూ కూర్చుండిపోయేసరికి వంశీ మళ్ళీ అడిగాడు.

''ఇంకా ఎందుకమ్మ... అలా దిగులుగా ఉన్నావ్...?''

ఆవిడ మళ్ళీ నిట్టూర్చింది.

''అవును... వంశీ, నాకో సందేహం కలుగుతోంది? మీ ఇద్దరూ మీ నాన్న పిల్లలే! ఇద్దరూ కూడా నా చేతుల్లో పెరిగినవాళ్ళే! అయినా మీ ఇద్దరి మనస్తత్వాలలో ఈ తేడా ఎందుకు వచ్చినట్లూ...? బహుశా... తల్లులు వేరేగా! నీకు.. మీ అమ్మ మనసులోని మంచితనం పుట్టుకతోనే అలవడింది కాబోలు! అనూషకి నా స్వార్థం ఏదో అబ్బిందేమో... లేకపోతే అంత ఆశగా అలా మాట్లాడతుందా...?!''

''అవునమ్మా... నువ్వు నిజంగా స్వార్థపరురాలివే...!'' తమాషాగా అన్నాడు వంశీ. ఆవిడ విస్మయంగా చూసింది.

వంశీ చిరునవ్వుతో వివరణ ఇచ్చాడు ''అవునమ్మా... నీ స్వార్థం నాకో గొప్ప వరంగా మారింది! నువ్వు... స్వార్థంతో ఎవరో కన్న పిల్లవాడిని స్వంతం చేసేసుకుని నీ పిల్లాడిగానే పెంచావు!''

ఆ మాటలకు శ్యామసుందరి పెదవులపైకి చిరునవ్వు వచ్చింది. కొడుకు వైపు లాలనగా చూసింది.

***

సుమజ దగ్గర్నుండి ఫోను వచ్చేసరికి వంశీ కొంచెం నిరాసక్తంగా 'హలో' అనగానే తను గుర్తించేసింది... వంశీ హుషారుగా లేడనీ... ఏదో సమస్యతో సతమతమవుతున్నాడేమోననీ...

అదే అడిగేసరికి వంశీ కొంచెం మామూలుగా అయి అదేం లేదన్నాడు. సుమజ మళ్ళీ రెట్టించి అడిగేసరికి ''ఏదో చిన్న సమస్య. అంతేలే... అదేం అంత ప్రముఖమైనది కాదు'' అంటూ దాటవేసాడు గానీ

మళ్ళీ అడిగేసరికి ఇక వంశీకి చెప్పక తప్పిందికాదు. అది విన్న సుమజ ''నిజమే... చిన్న సమస్య. అనూష కోరికను కాదనటం ఎందుకూ... మీరన్నట్లుగా తనకి ఇచ్చేయవచ్చు కదా...?'' అంది.

వంశీ ఒక క్షణం మౌనంగా ఉండి ''సుమా... నేనో ప్రశ్న అడుగుతాను... సరిగ్గా సమాధానం చెబుతావా...?'' అనడిగాడు.

''అదేమిటో అడగకుండా ఈ ప్రశ్న ఏమిటీ...?''

''సరే... మీ ఇంటితో పోల్చితే, మా ఇల్లు చిన్నది కదా... నువ్వు ఇక్కడ మాతోపాటూ ఉండగలవా అనే సందేహం వచ్చిందిలే...!''

''ఉండలేనంటే... ఏం చేస్తారేం...?'' నవ్వింది.

''ఏముందీ... అద్దె ఇల్లే కాబట్టి సమస్య లేదు. ఇంకొంచెం పెద్దది తీసుకునే ప్రయత్నం ఇప్పటినుండే మొదలు పెడదామనీ..!''

''అంటే... నా అభిప్రాయానికీ కొంత విలువ ఉందన్నమాట! నేను మీ ఉద్దేశ్యం తెలుసుకోవాలని ఆ ప్రశ్న సరదాగా అడిగానంతే! ఇంకో విషయం చెప్పనా...? అమ్మా, నేనూ మీ ఇంటికి వచ్చినపుడు... మా అమ్మ మీ ఇంటిగురించి ఏం చెప్పిందో తెలుసునా... తనకి... తన పెళ్ళయిన కొత్తల్లో మా అమ్మవాళ్ళు ఉన్న ఇంటిని మీ ఇల్లు గుర్తు చేయటమే కాకుండా మనసు అప్పటి మధురమైన జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయిందంటూ... నన్ను పూరించేలా వర్ణించి చెప్పటం... వాళ్ళిద్దరి మాటల మధ్య చెప్పటం విన్నాను! అందుకేగా... మీతో వెళ్ళేటప్పుడు 'మధురభావనల కోసం సమయాన్ని బాగా పెంచటం అతి అవుతుందేమోనని ఆలోచించమని' మీకు చెప్పానూ....!'' అంటూ సుమజ మళ్ళీ సరదాగా నవ్వింది.

వంశీ కూడా నవ్వుతూ ''నీ మాటలు వింటోంటే... నాకూ సరదాగా వెంటనే పెళ్ళికి సిద్ధపడి పోవాలనిపిస్తోంది సుమా!'' అన్నాడు.

''నాకు మాత్రం... మీ మాట పూర్తిగా నిజమనిపించటం లేదు... సరే... మామూలుగా అవటానికి ప్రయత్నం చేయండి... ఇక ఉంటానూ...!'' అంటూ సుమజ ఫోన్ ఆపేసింది.

కాసేపటికే... 'పోస్ట్' అన్న కేక వినిపించినా వంశీ కూర్చున్నచోటు నుండి లేవలేదు. ఈ రోజుల్లో... ఉత్తరమంటే... ఏదో నోటీసో, మరొకటో అయివుంటుందిలే అనుకుంటూ నిరాసక్తంగా ఉండిపోయాడు.

లోపల ఉన్న శ్యామసుందరి ఆ మాట విని బయటకు వెళ్ళి కవరును లోపలకు తీసుకువచ్చి... అటూ ఇటూ తిప్పి చూసి ''నీకే వచ్చింది...'' అంటూ వంశీ చేతికి ఇచ్చింది.

''అవునా...'' అంటూ ఆ కవరును అందుకున్న వంశీ అడ్రసు చూస్తూ తెలిసిన వాళ్ళ రైటింగ్ లా ఉందే అనుకుటూ ఆత్రంగా కవరు తెరిచాడు.

లోపల కాగితంపై చిరపరిచితమైన అక్షరాలు కనుపించి అతనికి ఉత్సాహం వచ్చేసింది. ఆత్రుతగా చివర సంతకం గమనించాడు, 'మీ జీవితంలోకి ప్రవేశించాలని తహతహలాడుతున్న'... అంటూ పక్కనే చిన్న మామిడిపండు బొమ్మవేసి ఉండటం చూడగానే వంశీ ఉల్లాసంగా ఆ కుదురైన అక్షరాల వెంట చూపులను పరుగు పెట్టించాడు.

''మధుర భావలహరితో మనము (మనసు) తేలిపోవటానికి కారణమైన మిత్రమా...

అందమైన బంధంలో ఇమిడి జీవితాన్ని ఆనందంగా సా...గనిద్దామా...

నింగీనేలా... చీకటీ, వెన్నెలా అన్నీ మనవే అన్నంత

ఉత్సాహంతో జీవితాన్ని ఉప్పెనలా పరుగు పెట్టిద్దామా...

తీయని ఊహల పల్లకీలో ఊరేగింపు చాలించి

తలుపు తీసిన అందాల లోకంలోకి తన్మయత్వంతో అడుగు పెట్టేద్దామా...

సుగంధాలు వెదజల్లే జాజిపూల జాతరలా జీవితాన్ని మార్చేద్దామా...

ఏమంటావు... మిత్రమా... సెలవీయరాదా...

మధుర భావలహరిలో మనము (ఇద్దరం) పరవశించి పోవగా...''

చదువుతూ చివర వేసి ఉన్న మామిడి పండు చిత్రాన్ని ఇష్టంగా తాకి... ఒక కాగితం తీసుకుని వంశీ వెంటనే రాయటం మొదలు పెట్టాడు.

'సుమజా... అడిగిన వెంటనే నువ్వు రాసి పంపిన వచన కవిత్వం లాంటి జాబును ఇపుడే అందుకుని... ఆ వెంటనే కవితలోని ప్రశ్నకు బదులుగా నేనీ రెండు వాక్యాలనూ రాసేస్తున్నా...

సుమజా... నీ మాటల మాయాజాలంతో నా జీవితం మజా మజాగా సా... గిపోతుందనే నమ్మకం, ఆనందం కలుగుతున్నాయి! నువ్వన్నట్లుగా తొందరలోనే కొత్త లోకంలోకి అడుగు పెట్టేద్దాం... సరేనా...'

ఆ కాగితం జేబులో పెట్టుకుని వంశీ వెంటనే పోస్టు ఆపీసుకు వెళ్ళి ఓ కవరు కొని... అందులో పెట్టి అంటించి అడ్రసు రాసి పోస్టు చేసి ఇంటికి వచ్చాడు.

* * *

వంటగదిలో విచారంగా కూర్చుని ఉన్నట్లున్న తల్లిదగ్గరకు వెళ్ళి ''ఏమిటమ్మా... అలా ఉన్నావూ...?'' అనడిగాడు.

ఆవిడ నిట్టూర్చింది.

''అనూష ఇపుడే బయలుదేరి వెళ్ళింది వాళ్ళ వూరుకు...!'' నిర్లిప్తంగా ఆవిడ బదులు చెప్పేసరికి వంశీ అదేమిటంటూ హడావుడిగా బయటకు వెళ్ళబోతోంటే ఆవిడ చేయి అడ్డం పెట్టింది ఆపుతున్నట్లుగా. తను అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాననీ, ఎవరూ తనతో రానవసరం లేదని ఖచ్చితంగా చెప్పింది. పైగా వెళ్తూ... తన కోరిక తీరిస్తేనే పెళ్ళికి వస్తానంటూ నిర్మోహమాటంగా చెప్పింది!" ఆవిడ గొంతు కొంచెం బొంగురుపోయింది. ''మీ నాన్న కోరిక, మాటలు గుర్తు చేసాకయినా మనసు మార్చుకుంటుందని భ్రమపడ్డాను!'' అంటూ ఆవిడ మళ్ళీ నిట్టూర్చింది.

వంశీ ఆవిడ కుర్చీదగ్గర కాళ్ళముందు కూర్చుని మెల్లగా అన్నాడు ''నేను చెప్పా కదమ్మా... అనూ కోరిక కాదనటం ఎందుకూ అని, దాని గురించి నీకు మాత్రం అంత ఆలోచనా, దిగులూ ఎందుకూ... మన ఇంట్లో వాళ్ళకే కదా ఇస్తున్నాం...! అపుడు నాన్న అలా చెప్పారుగానీ, ఇపుడు... అనూ కోరిక వింటే, ఆయనకూడా కాదనేవారు కాదని నాకనిపిస్తోంది!

అమ్మా... నీకో విషయం గుర్తు చేయనా... ఒకసారి నాన్న ఏవో విషయాలు చెబుతూ దిగులుగా... వ్యాపార సంబంధంగా అనుకున్నట్లుగా లాభం రాలేదని అన్నారు. అపుడు నువ్వేమన్నావ్... లాభనష్టాలనేవి సహజం! ఈ రోజు నష్టం వస్తే... ఇంకోరోజు లాభం వస్తుంది! ఇపుడూ లాభం వచ్చినట్లే అనుకుంటే... సమస్యే ఉండదు. మనకి ప్రస్తుతానికి లోటు లేకుండా బాగానే జరుగుతోందిగా. అది చాలు!' అంటూ చెప్పావు.

మరి... ఇపుడెందుకమ్మా... అలా సరిపెట్టుకోవటం లేదూ... అన్నీ సవ్యంగా జరిగితే... ఏమో... మనమూ మంచిచోట, మంచి ఇల్లు కట్టుకోగలుగుతామేమో... ఇలా అనుకుంటే బావుంటుందిగా. ఒకవేళ జరగలేదనుకో... ఇది మనకు నచ్చకపోతే మరో మంచి ఇంటిని చూసుకుని మారదాం...!''

వంశీ తల్లికి తన మాటలతో భరోసా కల్పించాలనుకున్నట్లుగా చెబుతూ నవ్వుతూ చూసాడు.

ఆవిడ మళ్ళీ నిట్టూర్చింది. ''నువ్వన్నది నిజమే వంశీ! కానీ... నా బాధ ఏమిటంటే... నువ్విలా ఇంత మంచి మనసుతో ఆలోచిస్తున్నావా... మరి... అనూకి ఎందుకింత స్వార్థం వచ్చిందీ...? వాళ్ళకి స్వంత ఇల్లు ఉంది. అయినా తనకి వేరేగా పెద్దది కావాలట! కోరికలకు కళ్ళెం వేయాలనే జ్ఞానం అనూకి ఎందుకు కలగటం లేదూ....? మనమైనా ఆ విషయం తనకి నేర్పించాలిగా... అలా కాకుండా... తన ఇష్టాలని, కోరికలనూ మనమూ తీర్చాలనుకోవటం మంచిదేనా... ఇదే నా ఆలోచన! అంతకుమించి ఇంకేమీ లేదులే...'' అంటూ శ్యామసుందరి లేచి నిలబడింది. ''సరేలే... ఏం జరగాలో అది జరుగుతుంది! నువ్వు... నీ పనులు చూసుకో. నేనేం దిగులుగా లేను.... బాగానే ఉన్నాను!'' అంటూ కొడుకు వైపు చిరునవ్వుతో చూసింది.